నమస్తే తెలంగాణ

# జగిత్యాల

5 | కరీంనగర్, ఆదివారం 7 ఏప్రిల్ 2024 | JAGTIAL




రైతుదీక్షలో నినదిస్తున్న కేటీఆర్, ఆగయ్య, కొండూరి రవీందర్‌రావు, గూడూరి ప్రవీణ్, జిందం కళ, చక్రపాణి, తదితరులు



# రైతుల కోసం బరాబర్ కొట్లాడుతం

- ఎండిపోయిన పంటలకు ఎకరాకు ₹25వేల చొప్పున పరిహారం ఇవ్వండి
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేయండి
- అన్నదాతకు న్యాయం జరిగేదాకా అండగా ఉంటాం
- బోనస్‌పై రేపటి నుంచి నిలదీస్తాం
- రైతు దీక్షలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం రైతుల తరఫున బరాబర్ కొట్లాడుతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. నీళ్లు లేక ఎండిపోయిన పంటలకు ఎకరానికి ₹25వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాకా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగేదాకా అండగా నిలుస్తామని, రేపటి నుంచి బోనస్‌పై కాంగ్రెస్‌ను నిలదీస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ వద్ద శనివారం నిర్వహించిన రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో ఇంత సంక్షోభం నెలకొంటుందని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయిన నాలుగు నెలల్లోనే మాట్లాడుకోవాల్సి వస్తుందని అనుకోలేదన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఏడు పదుల వయసులో ఎర్రటి ఎండల్లో జనగామ, సూర్యాపేట, నల్లగొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించి రైతన్నకు భరోసా కల్పించారన్నారు. కానీ, రేవంత్‌రెడ్డి ఐపీఎల్ మ్యాచ్‌లు అంటూ తిరుగుతున్నాడని విమర్శించారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన కేసీఆర్‌ను కాదని వ్యవసాయాన్ని దండుగ చేసే రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఎన్నుకుని తప్పుచేశామని రైతులు ఆవేదన చెందుతున్నారని, కేసీఆర్ ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామన్న బాధలో చెప్పారు. రైతులు, నేతన్నలు ఇబ్బందుల్లో ఉన్నారని, సిరిసిల్లలో నేతన్న ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నల సంక్షేమం కోసం సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల్‌లో కేసీఆర్ నాయకత్వంలో దీక్షలు చేపడుతామన్నారు. నిరుద్యోగ యవత కోసం ప్రధాన ప్రతిపక్షంగా పోరాటం చేస్తామన్నారు.

## కాంగ్రెస్ సృష్టించిన కరువే..

మంత్రులు, ముఖ్యమంత్రి మాటలు వింటుంటే వారి పరిజ్ఞానం ఏంటో అర్థం కావడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'కరువు వస్తే మమ్మల్ని తిడతారా?' అని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్న మాటలు విడ్డూరంగా ఉన్నాయని, రాష్ట్రంలో గత వానకాలం 14 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైందని గుర్తు చేశారు. అప్పుడు అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలన్న ఆయన అధికారంలోకి రాగానే మాట మార్చారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న కరువు కాలం తెచ్చింది కాదని, ఇది కాంగ్రెస్ సృష్టించిన కరువని ధ్వజమెత్తారు. పోయిన వానకాలంలో వర్షాలు సంమృద్ధిగా కురిశాయని, చెరువులు, ప్రాజెక్టులు నిండాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి బ్యారేజీ ద్వారా నీళ్లు ఎత్తిపోసి మిడ్ మానేరుకు నీరు అందించిన ఘనత కేసీఆర్‌దే అని స్పష్టం చేశారు. మిడ్ మానేరు నుంచి మల్కపేట, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణను సస్యశ్యామలం చేశారన్నారు. ఇప్పుడు మేడిగడ్డ నుంచి రోజుకు రెండు వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నదని, మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగితే కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతులు చచ్చినా ఫర్వాలేదు కానీ, కేసీఆర్ బదనాం కావాలన్న లక్ష్యంతో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.లక్ష కోట్ల దోపిడీ జరిగిందంటూ యూట్యూబ్ చానెళ్ల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ మనుగడ కోసమే కాళేశ్వరంపై అసత్యాన్ని జనంలోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. కేసీఆర్ రైతుల కష్టాలను తెలుసుకునేందుకు పంటల పరిశీలనకు వెళ్తే కాళేశ్వరం నుంచి నీళ్లు ఇస్తున్నారని, కాళేశ్వరంలో రెండు పిల్లర్లు రిపేరు చేస్తే తెలంగాణలో కరువు పరిస్థితులు ఉండేవి కాదన్నారు.

## హామీలు ఏమైనయ్

కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు మొండి చేయి చూపిందని కేటీఆర్ విమర్శించారు. వంద రోజుల పాలనలో చేసిందేమీ లేదని మండిపడ్డారు. తులం బంగారం, ₹2 లక్షల రుణమాఫీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రశ్నిస్తే సీరియస్‌గా తీసుకోవద్దని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. క్వింటాల్‌కు ₹500 బోనస్ లేదని, రైతు బంధుపై స్పష్టత లేదని, రైతు రుణమాఫీకి దిక్కేలేదని ధ్వజమెత్తారు. ఆశపడి ఓటేస్తే ఎన్నికల కోడ్ పేరుతో పథకాలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో రైతు బంధును అడ్డుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని, నిజంగానే చిత్తశుద్ధి ఉంటే ₹500 బోనస్ ఇస్తామని ఎలక్షన్ కమిషన్‌కు రేవంత్‌రెడ్డి ఉత్తరం రాయాలని, తాము కూడా బరాబర్ లేఖ ఇస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ ఎన్నికల కమిషన్ అనుమతి నిరాకరిస్తే ఎన్నికలైన మరుసటి రోజే ప్రతి రైతుకూ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్‌పై ఉందని చెప్పారు. కరీంనగర్ లాంటి పట్టణాల్లో వచ్చిన నీటి కరువు రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో రాబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథను వినియోగించుకునే సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు.

## బోనస్‌పై నిలదీస్తాం

కాంగ్రెస్ అవలంబిస్తున్న దగాకోరు విధానాలను ప్రజలకు వివరిస్తామని కేటీఆర్ చెప్పారు. రేపటి నుంచి బీఆర్‌ఎస్ కండువాలు వేసుకుని కల్లాల వద్దకు వెళ్లి రైతులకు వచ్చే బోనస్‌పై కాంగ్రెస్‌ను నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చే అవసరం తమకు లేదని, ఆయన మొగోడు అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లంకె బిందెల కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవుపలికారు. మందికి పుట్టిన పిల్లలు తమ పిల్లలు అని చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశారు. నోటిఫికేషన్ ఇవ్వకుండానే గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు కాగితాలు ఇస్తూ తానే ఉద్యోగాలు ఇచ్చిన అని రేవంత్‌రెడ్డి ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నేత ఈటల రాజేందర్ రైతు రుణమాఫీ మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు చక్రపాణి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిరిసిల్లలో రైతు దీక్షకు హాజరైన మహిళలు, నాయకులు, రైతులు

# ఎండ @ 43.5 డిగ్రీలు

## ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా కొల్వాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు



కరీంనగర్‌లోని డీర్ పార్క్‌లో ఈము పక్షులకు నీళ్లు పడుతున్న సిబ్బంది

భానుడు అప్పుడే నిప్పుల కొలిమిలా మండుతున్నాడు. ఉదయం తొమ్మిదింటి నుంచే ప్రతాపం చూపెడుతున్నడు. మూడు, నాలుగు రోజులుగా ఎండ దంచికొడుతున్నది. రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలతో పొద్దంతా సుర్రుమంటున్నది. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం కొల్వాయిలో శనివారం 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇదే మండలంలోని పలు గ్రామాల్లో 42.5 డిగ్రీలపైగా టెంపరేచర్ నమోదైంది. భానుడి ప్రతాపంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతం అగ్నిగుండాన్ని తలపిస్తున్నది. జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతుండగా, ఇప్పుడే ఇలా ఉంటే ముందు ముందు ఎలా ఉంటుందోనని ప్రజానీకం భయపడుతున్నది. - సారంగాపూర్/వీణవంక/ కోల్‌సిటీ, ఏప్రిల్ 6



కరీంనగర్: రైతుదీక్షలో పాల్గొన్న కరీంనగర్ పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్‌ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, రైతులు

# పరిహారం ఇవ్వాల్సిందే..

- నష్టపోయిన పంటకు ఎకరానికి ₹25 వేలు చెల్లించాలి
- క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇవ్వాలి
- ₹2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలి
- బీఆర్‌ఎస్ రైతుదీక్షల్లో అన్నదాతల డిమాండ్
- ఆదుకోని కాంగ్రెస్ సర్కారు తీరుపై ధ్వజం

జగిత్యాల, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : సాగు నీరు అందక ఎండిపోయిన పంటలకు ఎకరానికి ₹25 వేల పరిహారం చెల్లించాలని రైతాంగం ప్రభుత్వాన్ని డిమాం డ్ చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్ ధాన్యానికి ₹500ల బోనస్ చెల్లించాలని, ₹2 లక్షల రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని స్పష్టం చేసింది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు శనివారం ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షలు చేపట్టగా, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గులాబీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ తీరుపై భగ్గుమన్నారు. ప్రభుత్వం వైఫల్యం వల్లే ఇవాళ పంటలు ఎండిపోతున్నాయని, తాము పెట్టుబడులు నష్టపోతున్నామని మండిపడ్డారు. అయినా పాలకులు స్పందించడం లేదని, కనీసం కన్నెత్తి చూడడం లేదని ఆవేదన చెందారు. ఏడు పదుల వయసులో కేసీఆర్ ఎర్రటి ఎండలో పంటలను పరిశీలించి తమకు ధైర్యం చెప్పారని, నాయకుడంటే ఇలా ఉండాలని స్ప ష్టం చేస్తున్నారు. కానీ, రేవంత్ మాత్రం క్రికెట్ మ్యాచ్ లు చూస్తున్నాడని, రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాడని విమర్శించారు. ఇటు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. అన్నదాతకు న్యాయం చేసేదాకా పోరాడుతామని స్పష్టం చేశారు. సిరిసిల్లలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కరీంనగర్, మానకొండూర్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్‌లో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, మెట్‌పల్లిలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల హాజరయ్యారు. వీరితోపాటు ఆయా నియోజకవర్గాల్లో మాజీ ఎ మ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో రైతుదీక్షకు తరలివచ్చిన రైతులు, నాయకులు



మంథని రైతు దీక్షలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్టమధూకర్




జగిత్యాల రైతు దీక్షలో వరికి బోనస్ ఇవ్వాలంటూ ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వసంత

# పంతుళ్లపై చర్యలు

## పదో తరగతి మూల్యాంకనానికి హాజరు కానందుకు విద్యాశాఖ కొరడా

- 62 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు
- మరికొందరికి మెమోలు ఇచ్చేందుకు సిద్ధం
- బెదిరింపులకు లొంగని కరీంనగర్ డీఈవో
- పంతం నెగ్గించుకునే ప్రయత్నంలో పలు ఉపాధ్యాయ సంఘాలు

**పదో తరగతి మూల్యాంకనానికి వివిధ కారణాలు చూపుతూ గైర్హాజరైన పంతుళ్లపై కొరడా ఝుళిపించేందుకు కరీంనగర్ జిల్లా విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. నిబంధనలు పాటించని సదరు ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా 62 మందికి తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు మరికొంత మందికి మెమోలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నది. అయితే, మూల్యాంకనం విషయంలో తమ మాటే చెల్లుబాటు కావాలంటూ కొన్ని ఉపాధ్యాయ సంఘాలు జిల్లా విద్యాధికారిని బెదిరింపులకు గురిచేసినా.. ఆయన మాత్రం లెక్కచేయకుండా ముందుకు సాగుతున్న తీరు ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఎలాగైనా సరే తమ పంతం నెగ్గించుకునే దిశగా ఉపాధ్యాయ సంఘాలు అడుగులు వేస్తున్నట్టు తెలుస్తున్నది.**

కరీంనగర్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ సెయింట్‌జాన్స్ పాఠశాలలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 3న ప్రారంభమైంది. ఇది 11వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ కేంద్రానికి వివిధ జిల్లాల నుంచి 2.20 లక్షల పైచిలుకు జవాబు పత్రాలు వచ్చాయి. వీటిని మూల్యాంకనం చేసేందుకు రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన 1,087 మంది ఉపాధ్యాయులకు విద్యాశాఖ విధులు కేటాయించింది. కాగా, అందులో చాలా మంది ఉపాధ్యాయులు వివిధ కారణాలు చూపుతూ మూల్యాంకన విధుల నుంచి తొలగించాలని అర్జీలు పెట్టుకున్నారు. సగానికి పైగా అంటే.. దాదాపు 600 మంది పంతుళ్లు తమకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ అర్జీలు పెట్టడంతో విద్యాశాఖ కంగుతిన్నది. ఇలా అయితే మూల్యాంకనం ఎలా పూర్తి చేస్తామని భావించింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నది. ఆరోగ్యం సరిగా లేదంటూ అర్జీలు పెట్టుకున్న ఉపాధ్యాయులను మూల్యాంకన కేంద్రానికి పిలిపించి అక్కడే మెడికల్ బోర్డు ద్వారా టెస్టులు నిర్వహించింది. సదరు మెడికల్ బోర్డు సూచనల మేరకు దాదాపు 80 శాతం అర్జీలను జిల్లా విద్యాశాఖ తిరస్కరించింది. ఆ తర్వాత సదరు ఉపాధ్యాయులు విధులకు హాజరుకావాలని ఆదేశాలు జారీచేసింది. మూల్యాంకన కేంద్రం వద్ద మెడికల్ బోర్డును పిలిచి పరీక్షలు చేయిచడంతో చాలా మంది ఉపాధ్యాయులు కంగుతిన్నారు. మెడికల్ బోర్డును పిలిచి, పరీక్షలు చేయించి తమ ఉపాధ్యాయులను అవమాన పరిచారని, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన చేపడుతామంటూ జిల్లా విద్యాధికారి జనార్దన్ రావుకు పలు ఉపాధ్యాయ సంఘాలు మూడు రోజుల క్రితం నోటీసు ఇచ్చాయి. అంతేకాదు, అర్జీలు పెట్టుకున్న వారికి విధులు మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ మరి కొన్ని సంఘాలు డిమాండ్ చేశాయి.

## వారంలో సంజాయిషీ ఇవ్వాల్సిందే

ఎన్నడూ లేని విధంగా మెడికల్ బోర్డు ద్వారా టెస్టులు చేయించిన జిల్లా విద్యాధికారి ఉపాధ్యాయ సంఘాల డిమాండ్లను పక్కనపెట్టి మరో అడుగు ముందుకేశారు. చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విధులకు గైర్హాజరైన 62 మంది టీచర్లకు తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. చట్టప్రకారం మీపై చర్యలు ఎందుకు తీసుకోరాదో..? వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆ నోటిసుల్లో పేర్కొన్నారు. అక్కడితో ఆగకుండా గైర్హాజరైన మరికొంత మంది ఉపాధ్యాయుల వివరాలపై విద్యాధికారులు ఆరా తీస్తున్నారు. సదరు ఉపాధ్యాయులకు ఒకటి రెండు రోజుల్లో మెమోలు జారీ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ విషయంలో వెనక్కి తగ్గొద్దని జిల్లా విద్యాధికారి గట్టి పట్టుదలతో ఉండగా.. ఎలాగైనా సరే తమ పంతం నెగ్గించుకోవాలని పలు ఉపాధ్యాయు సంఘాలు పట్టుదలతో ముందుకెళ్తున్నాయి. అంతేకాదు, షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలంటూ డీఈవోను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. ఆయన మాత్రం తాను చట్టపరంగా తీసుకునే చర్యలకు ఏ సంఘం అడ్డు రావొద్దని సీరియస్‌గానే చెప్పినట్లు తెలుస్తున్నది. ఈ పరిణామాలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారగా, ఉపాధ్యాయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది.




















అధునాతన వైద్య ప్రమాణాలు సంతాన సాఫల్యంతో సానుకూల ఫలితాలు: ఇది కరీంనగర్ పద్మజ సంతాన సాఫల్య సంకేతం. గత 25 సం॥ క్రితం కరీంనగర్‌లో ప్రారంభమైన ఈ IVF సెంటర్‌లో దేశ విదేశాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చి సంతానం పొందిన ఎన్నో వేల దంపతులు ఉన్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లో పద్మజ సంతాన సాఫల్య కేంద్రం 25 సం॥లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒకే రోజులో ట్విన్స్, ట్రిపుల్స్ అయిన ఇన్ని జంటలను మీ ముందుకు తీసుకొని వచ్చాము. ఇది చూసి సంతానం లేక నిరుత్సాహపడుతున్న మరిన్ని దంపతులకు ఒక Hope అనేది రావాలి. అనేది మా ఉద్దేశం.

**పిల్లలు లేని దంపతులకు స్త్రీ మరియు పురుషుల పునరుత్పత్తి వ్యవస్థ ద్వారా IVF ఒక అద్భుతం!**

IVF విధానంలో భార్య అండాశయం నుండి అండాలను బయటకు తీసి భర్త వీర్య కణాలను అండం లోపలికి inject చేసి incubate చేస్తాము. 3 రోజుల తర్వాత ఫలదీకరణం చెందిన పిండం (Embryo)ని తిరిగి గర్భాశయంలో ప్రవేశపెడతాము. IVF చేయడానికి వాడే మెడిసిన్స్ డిస్పోసబుల్స్, మీడియా పరికరాలు అన్ని విదేశాల నుండి దిగుమతి చేయబడినవే అందుకే ఈ పద్ధతికి ఖర్చు ఎక్కువ అవుతుంది. 25 సం॥లలో ఎన్నో వేల కుటుంబాలకు సంతానం అందించింది. ఈ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం ఉదా॥ కి ఒకే రోజులో IVF పద్ధతి ద్వారా conceive అయి సంతోషంగా ఉన్న జంటలు వీరందరు. ఇంత సక్సెస్ ఇవ్వడాని/రావడానికి వెనుక ఎంతో కష్టం, శ్రమ, Dedication ఉన్నాయి. అంతర్జాతీయ సక్సెస్ రేట్ 35%-40% ఉండగా 70%-75% సక్సెస్‌ని ఇవ్వగలుగుతున్నాము. ఈ రిజల్ట్స్ వలనే అన్ని రాష్ట్రాలు, విదేశాల నుండి కూడా సంతానలేమి వల్ల అక్కడ IVFలు చేయించుకొని సక్సెస్ కాని వారు కూడా మన కరీంనగర్ వస్తున్నారు. ఈConcive గర్భదారణ అయిన వీరి కళ్ళలో ఆనందం చూశాక మేము పడే శ్రమ Strain అన్ని మర్చిపోయి తిరిగి మరింత రిజల్ట్స్ ఇవ్వడానికి కష్టపడుతున్నాము. ఎన్నో మూగ, చెవిటి జంటలు, వికలాంగులు, సంతానం accidentలో మరణించి depressionలో ఉన్న తల్లి,తండ్రులకు, కవలలు, ముగ్గురిని



కూడా IVF పద్ధతి ద్వారా ఇవ్వగలిగాము. ఈ పద్ధతి గురించి ఎన్నో అపోహలు, మాకు ఎన్నో ఆటంకాలను దాటుకొని నిరంతర కృషి చేస్తూ Fertilityలో ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ చాలా మంది సంతానం లేని జంటలకు మాతృత్వాన్ని ఇవ్వగలుగుతున్నాము. ఇలా అంతర్జాతీయ ప్రమాణాలతో మేము అందిస్తున్న వైద్యంలో దంపతులు తమ పిల్లలకు జన్మనివ్వడం వరంగా భావించి మీడియాతో సంతోషాన్ని పంచుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అనేక సాఫల్య కేంద్రాలు ఉన్నప్పటికి ఈ IVF Centre కి ఒక ప్రత్యేకత ఉండడానికి కారణం ఒకటి మేము అందిస్తున్న వైద్యంలో వస్తున్న ఫలితాలే మాకు అండగా నిలుస్తున్నాయి. చికిత్స పరంగా ఏ విషయంలో కూడా తగ్గకుండా ముందు దంపతులకు కౌన్సిలింగ్ ఇవ్వడం పర్టిలిటీ ట్రీట్‌మెంట్‌ని అందించడం మరియు మంచి ఫలితాలను ఇవ్వడం ద్వారా బారీ సానుకూల స్పందనతో ముందుకు సాగడం జరుగుతుంది. ప్రతి సం॥ కేవలం ఈ IVF వైద్యంలో వస్తున్న Updates New Technology పైనే ప్రత్యేక దృష్టి సారించి అధిక శాతం ఫలితాలు ఇవ్వడానికి కృషి చేస్తున్నాము.

డా॥ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం, కరీంనగర్.

ADVT